


ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 29-10-2026 | సంపుటి - 31 | సంచిక - 155 | రూ : 4 | పేజీలు: 8



రాత్రి వేళల్లో నో ఛార్జింగ్

2లో

రైల్వే బోర్డు కీలక నిర్ణయం

- రైళ్లలో రాత్రి 11 నుంచి ఉదయం 5 వరకు ఛార్జింగ్ పాయింట్లు నిలిపివేత
- ప్రయాణికుల భద్రత, అగ్నిప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ నిర్ణయం
- ఇటీవల పవర్ బ్యాంక్ పేలిన ఘటనతో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఆదేశం
- నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్న అధికారులు

క్యాన్సర్ రోగులకు కేంద్రం ఊరట..

543 మందుల ధరలు తగ్గింపు!

- క్యాన్సర్ చికిత్స మందుల ధరలను సవరించిన కేంద్రం
- మొత్తం 543 బ్రాండ్ల ఔషధాల MRPల తగ్గింపు
- నవంబర్ 9 నుంచి కొత్త ధరలు
- ట్రేడ్ మార్జిన్ల నియంత్రణతో రోగులకు భారీ ఊరట
- కొన్ని మందుల ధరలు 80 శాతానికి పైగా తగ్గుదల



క్యాన్సర్ చికిత్స విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్యాన్సర్ చికిత్సలో వినియోగించే 543 బ్రాండ్ల ఔషధాల ధరలను (MRP) సవరిస్తూ జాతీయ ఫార్మాస్యూటికల్ ధరల నిర్ణయ సంస్థ (NPPA) ఓ ప్రకటన చేసింది. ఈ కొత్త ధరలు నవంబర్ 9 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయంతో అత్యంత ఖరీదైన కొన్ని క్యాన్సర్ మందుల ధరలు 80% పైగా తగ్గనున్నాయి. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫార్మాస్యూటికల్స్ విభాగం కింద పనిచేసే NPPA, ఈ మేరకు సవరించిన ధరలతో కూడిన జాబితాను విడుదల చేసింది. అక్టోబర్ 17న 137 నాన్ తరువాయి 2లో

ఏపీకి తెలంగాణ భరోసా

తుఫాను వేళ సాయానికి సిద్ధం

- ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ

2లో



వణికిస్తున్న అర్నాబ్ తుపాన్

- వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అప్రమత్తమైన యంత్రాంగం
- రైతాంగాన్ని వీడని ఆందోళన
- నేలపాలైన వరి, దెబ్బతింటున్న పత్తి
- కల్లాల్లో తడిసిన మక్కలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సరాసరి వర్షపాతం 10.2మీమీ గా నమోదు



ఖమ్మం/బయ్యారం : బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుపాత్ ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురు గాలులతో కూడిన ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని రోజులుగా తీవ్రమైన వేడిని ఎదుర్కొన్న సామాన్య ప్రజలకు ఈ వాతావరణం కొంత ఉపశమనాన్ని కలిగిస్తున్నప్పటికీ, మరోవైపు అన్నదాతలను మాత్రం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఏపీ సరిహద్దు ప్రాంతాలైన సత్తుపల్లి, అశ్వారావుపేట, వేంసూరు, దమ్మపేట మండలాలతో పాటు పెనుబల్లి, భద్రాచలం, మణుగూరు, చర్ల, పాల్వంచ, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉంది. ఎల్‌నినో ప్రభావంతో అడుగంటిపోయిన భూగర్భ జలాలు, ఎండిపోయిన రిజర్వాయర్లు ఈ వర్షాలతో కొంతమేరకు పుంజుకునే అవకాశం ఉంది. కానీ, చేతికి వచ్చే దశలో ఉన్న వరి, పత్తి, ఉద్యాన పంటలు నేలకొరగడంతో రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసిపోయింది. భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లి మండలం మర్కోడులో తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి గీత కార్మికుడు కోతి యాదగిరి మృతి తరువాయి 2లో



కరువును సమిష్టిగా ఎదుర్కొందాం

- ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం
- కేంద్రానికి ఇప్పటికే నివేదిక పంపించాం
- అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్షం .. విపక్షాల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం : అఖిలపక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- సీపీఐ(ఎం) తరపున హాజరైన రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి
- పాల్గొన్న బీఆర్ఎస్, సీపీఐ, ఎంఐఎం, బీజేపీ, ఇతర పార్టీల నేతలు

హైదరాబాద్ : ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ఏర్పడ్డ కరువు పరిస్థితులను కలిసికట్టుగా ఎదుర్కొందామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అఖిలపక్ష నేతలకు విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో డిప్యూటీ సీఎం అధ్యక్షతన అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడ్డ కరువు నివారణకు రాష్ట్రప్రభుత్వం అన్నిముందస్తు చర్యలను తీసుకుంటోం తరువాయి 2లో

బ్యాలెట్ పేపర్ ఎన్నికలు..

కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?: మోదీ


- నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు
- 12 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కని వైనం
- ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతో జరిగాయని గుర్తుచేసిన ప్రధాని మోదీ
- మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్

2లో



పరిషత్ ఎన్నికలు వాయిదా..

నవంబర్ 5న పోలింగ్



- ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ సవరణ
- పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలలో మార్పులు
- నవంబర్ 3కి బదులుగా 5వ తేదీన పోలింగ్
- నవంబర్ 5కి బదులుగా 7వ తేదీన ఓట్ల లెక్కింపు

2లో



అప్రమత్తంగా ఉండండి...

- హైదరాబాద్‌లో తాగు నీటి సమస్య రానివ్వద్దు
- క్యూర్ ఏరియాలో ఎస్టీపీలు వంద శాతం పని చేయాలి
- భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటినే వినియోగించాలి : తాగు నీటి సరఫరా, ఎస్టీపీలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో

కరువును సమిష్టిగా ఎదుర్కొందాం

హైదరాబాద్ : ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ఏర్పడ్డ కరువు పరిస్థితులను కలిసికట్టుగా ఎదుర్కొందామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అఖిల పక్ష నేతలకు విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో డిప్యూటీ సీఎం అధ్యక్షతన అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడ్డ కరువు నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలను తీసుకుంటోందని తెలిపారు. కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించామనీ, అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి రాష్ట్రానికి రావాల్సిన సహాయంపై విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కునే సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. నేతలు ప్రస్తావించిన అంశాలను నమోదు చేసుకున్నామనీ, సాధ్యమైన మేరకు వాటిని ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంపై గతంలోనూ శాసనసభలో చర్చించామనీ, వివిధ సమావేశాలు, సదస్సులు నిర్వహించడంతోపాటు శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపామని వివరించారు. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, అవసరమైన సన్నద్ధతతో ఉన్నామని పేర్కొన్నారు. వర్షపాతం లోటు దేశ వ్యాప్తంగా ఉండటం, ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షాలు కురియక పోవడంతో ప్రాజెక్టుల్లో నీరు అడుగంటడం ఆందోళన కలిగించే అంశమన్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేస్తూ, వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు శాఖలవారీగా సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు.

రాత్రి వేళల్లో నో ఛార్జింగ్
రైల్వే బోర్డు కీలక నిర్ణయం

రైలు ప్రయాణికుల భద్రతను మరింత కట్టుదిట్టం చేసే దిశగా భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రైళ్లలోని అన్ని కోచ్‌లలో రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మొబైల్, ల్యాప్‌టాప్ ఛార్జింగ్ పాయింట్లను తప్పనిసరిగా స్విచ్ ఆఫ్ చేయాలని రైల్వే బోర్డు అన్ని జోనల్ కార్యాలయాలకు అక్టోబర్ 26న ఆదేశాలు జారీ చేసింది. అగ్నిప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ నిబంధనను ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. ఇటీవల సౌత్ ఈస్టర్న్ రైల్వే పరిధిలోని ఓ రైలులో రాత్రిపూట ఛార్జింగ్ పెట్టిన ప్రయాణికుడి పవర్ బ్యాంక్ పేలి పొగలు వ్యాపించాయి. నిబంధనల ప్రకారం ఆ సమయంలో ఛార్జింగ్ పాయింట్లను సిబ్బంది నిలిపివేయాల్సి ఉన్నా, వారు నిర్లక్ష్యం చేయడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించిన రైల్వే బోర్డు, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పాత నిబంధనను కఠినంగా అమలు చేయాలని నిర్ణయించింది. వాస్తవానికి ఈ నిబంధన కొత్తదేమీ కాదు. 2013లో హజూర్ సాహిబ్ నాందేడ్ కేఎస్ఆర్ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదం తర్వాత, రైల్వే భద్రతా కమిషనర్ సిఫార్సుల మేరకు 2014లోనే రైల్వే బోర్డు ఈ నిబంధనను అమల్లోకి తెచ్చింది. ప్రయాణికుల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకు ఛార్జింగ్ పాయింట్లను ఆఫ్ చేయాలని అప్పట్లో నిర్ణయించారు. అయితే, కొన్నిచోట్ల ఇది సరిగా అమలు కావడం లేదని బోర్డు గుర్తించింది. తాజా ఆదేశాల ప్రకారం, ఈ నిబంధన అమలును పర్యవేక్షించేందుకు సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వాలని, అధికారులు, సూపర్‌వైజర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. రాత్రిపూట ఛార్జింగ్ వల్ల అగ్నిప్రమాదాలే కాకుండా, విలువైన వస్తువుల దొంగతనం జరిగే ప్రమాదం కూడా ఉందని గతంలోనే పలు రైల్వే జోన్లు హెచ్చరించిన నేపథ్యంలో ఈ చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

క్యాన్సర్ రోగులకు కేంద్రం ఊరట.. 543 మందుల ధరలు తగ్గింపు!

క్యాన్సర్ చికిత్స విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్యాన్సర్ చికిత్సలో వినియోగించే 543 బ్రాండ్ల ఔషధాల ధరలను (MRP) సవరిస్తూ జాతీయ ఫార్మాస్యూటికల్ ధరల నిర్ణయ సంస్థ (NPPA) ఓ ప్రకటన చేసింది. ఈ కొత్త ధరలు నవంబర్ 9 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయంతో అత్యంత ఖరీదైన కొన్ని క్యాన్సర్ మందుల ధరలు 80% పైగా తగ్గనున్నాయి. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫార్మాస్యూటికల్స్ విభాగం కింద పనిచేసే NPPA, ఈ మేరకు సవరించిన ధరలతో కూడిన జాబితాను విడుదల చేసింది. అక్టోబర్ 17న 137 నాన్‌షెడ్యూల్డ్ క్యాన్సర్ మందుల కోసం ట్రేడ్ మార్జిన్ రేషనలైజేషన్ (TMR) విధానాన్ని ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం ద్వారా మందుల అమ్మకాలపై ఉన్న అధిక ట్రేడ్ మార్జిన్లకు కళ్లెం వేసి, క్యాన్సర్ చికిత్సను మరింత అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ధరల తగ్గింపు వల్ల రోగులపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుంది. ఉదాహరణకు, అబాట్ సంస్థకు చెందిన 'బెవాసిజాబ్' 100 mg/4 ml ఇంజెక్షన్ ధర రూ. 21,767 నుంచి రూ. 5,930కి తగ్గింది. అదేవిధంగా, 'ఫుల్వెస్ట్రాంట్' 50 mg ఇంజెక్షన్ ధర రూ. 26,072 నుంచి రూ. 5,491కి దిగివచ్చింది. డాక్టర్ రెడ్డీస్ వారి 'అజాసిటిడిన్' 100 mg ఇంజెక్షన్ ధర రూ. 6,337 నుంచి రూ. 1,495కి తగ్గింది. ధరలు తగ్గిన ఈ మందుల జాబితాలో 20కి పైగా క్యాన్సర్ రకాల చికిత్సలో వినియోగించే ఇమ్యునోథెరపీ ఔషధాలు ఉన్నాయి. వీటితో పాటు రొమ్ము, ప్రోస్టేట్ క్యాన్సర్ రోగుల కోసం వాడే డెనోసుమాబ్, న్యూట్రోపెనియా నివారణకు ఉపయోగించే పెగ్‌ఫిల్‌గ్రాస్టిమ్, పెద్దప్రేగు, అండాశయ, గర్భాశయ క్యాన్సర్ల చికిత్సలో వాడే బెవాసిజుమాబ్ వంటి కీలకమైన మందులు కూడా ఉన్నాయి. ఔషధ తయారీ కంపెనీలు మంగళవారం వరకు అందించిన సమాచారం ఆధారంగా NPPA ఈ 543 ఔషధాల జాబితాను రూపొందించింది. మిగిలిన కంపెనీలు కూడా తమ సవరించిన ధరల వివరాలను అందించిన తర్వాత ఈ జాబితాను మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

వణికిస్తున్న అర్నాబ్ తుపాన్

ఖమ్మం/బయ్యారం : బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుపాత్ ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురు గాలులతో కూడిన ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని రోజులుగా తీవ్రమైన వేడిని ఎదుర్కొన్న సామాన్య ప్రజలకు ఈ వాతావరణం కొంత ఉపశమనాన్ని కలిగిస్తున్నప్పటికీ, మరోవైపు అన్నదాతలను మాత్రం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఏపీ సరిహద్దు ప్రాంతాలైన సత్తుపల్లి, అశ్వారావుపేట, వేంసూరు, దమ్మపేట మండలాలతో పాటు పెనుబల్లి, భద్రాచలం, మణుగూరు, చర్ల, పాల్వంచ, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉంది. ఎల్‌నినో ప్రభావంతో అడుగంటిపోయిన భూగర్భ జలాలు, ఎండిపోయిన రిజర్వాయర్లు ఈ వర్షాలతో కొంతమేరకు పుంజుకునే అవకాశం ఉంది. కానీ, చేతికి వచ్చే దశలో ఉన్న వరి, పత్తి, ఉద్యాన పంటలు నేలకొరగడంతో రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసిపోయింది. భద్రాద్రి జిల్లా అళ్లపల్లి మండలం మర్కోడులో తాటి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి గీత కార్మికుడు కోతి యాదగిరి మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అప్రమత్తమయ్యాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇరు జిల్లాల కలెక్టర్లు, అధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించి తుపాత్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. ప్రజల ప్రాణరక్షణే ప్రథమ ప్రాధాన్యతగా భావించి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ తుపాత్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఖమ్మం జిల్లాలో కూడా స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విద్యాసంస్థలకు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని కలెక్టర్ టీఎస్ దివాకర్ సంబంధిత మండల విద్యాశాఖ అధికారులను, సీడీపీఓలను ఆదేశించారు. తుపాత్ ముప్పు తొలగే వరకు జిల్లా అధికారులు, సిబ్బంది ఎవరూ హెడ్‌క్వార్టర్ విడిచి వెళ్లరాదని, వారికి మంజూరు చేసిన సెలవులను తక్షణమే రద్దు చేస్తున్నట్టు కలెక్టర్లు స్పష్టం చేశారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆధ్వర్యంలో చాతకొండ నుంచి వచ్చిన 22 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని సమస్యాత్మక ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉంచారు. గోదావరి పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అప్రమత్తం చేస్తున్నారు. సీతారామ ప్రాజెక్టుతో పాటు పాలేరు, వైరా, కిన్నెరసాని, బేతుపల్లి రిజర్వాయర్ల పరిధిలోని నీటి మట్టాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర సహాయం, సమాచారం కోసం ఖమ్మం కలెక్టరేట్‌తో పాటు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులో ఉంచారు. భారీ ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున, విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీచేశారు. రానున్న మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, పాతబడిన గోడలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, భారీ వృక్షాలకు దూరంగా ఉండాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

బయ్యారంలో తడిసిన మక్కలు

ఆర్నబ్ తుపాత్ ప్రభావంతో కురిసిన అకాల వర్షంతోపాటు ఈదురుగాలులు వీయడంతో చేతికి వచ్చిన మొక్కజొన్న పంట నెలకొరిగింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోసిన మొక్కజొన్న కంకులు వర్షానికి నాని పోయాయని, మొలకలు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, వరి పంటకు నష్టం వాటిల్లింది. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని పలువురు రైతులు వేడుకుంటున్నారు.

అప్రమత్తంగా ఉండండి

హైదరాబాద్ : ఎల్‌నినో నేపథ్యంలో తాగు నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. రిజర్వాయర్లలోని నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని కోరారు. క్యూర్ ఏరియాలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ)లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వంద శాతం సామర్థ్యంతో పని చేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని సెక్రటేరియట్‌తో పాటు సీఎంవో, అవుటర్ రింగ్ , మైట్రో రైల్ , ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ, ఇతర అవసరాలకు వినియోగించేలా చూడాలని సూచించారు. పబ్లిక్ పార్క్‌లు, రోడ్ల శుభ్రత కు కూడా ట్రీటెడ్ వాటర్ నే వాడాలని అన్నారు. భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రెడ్కో ఉన్నతాధికారులకు సూచించారు. ఎస్టీపీల్లో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొద్దని అన్నారు. ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కేంద్రాల పనితీరును ఎప్పటికిప్పుడు పర్యవేక్షించాలని హైడ్రా అధికారులకు సూచించారు. ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్టీపీల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రస్తుతం 26 ఎస్టీపీల్లో ట్రీటెడ్ వాటర్ ను గ్రీన్ ట్యాంకర్స్ ద్వారా పంపిణీ చేస్తున్నట్టు జలమండలి అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుం మాత్రమే వసూలు చేస్తున్నామని, నీళ్లను ఉచితంగా అందిస్తున్నామని వివరించారు.

ఏపీకి తెలంగాణ భరోసా.. తుఫాను వేళ సాయానికి సిద్ధం

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు. ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

పరిషత్ ఎన్నికలు వాయిదా..
నవంబర్ 5న పోలింగ్

ఆంధ్రప్రదేశ్‌లో జరగాల్సిన జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జెడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికలు వాయిదా పడ్డాయి. గతంలో ప్రకటించిన షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్పులు చేసింది. పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు తేదీలను కూడా రెండు రోజుల పాటు వెనక్కి జరిపింది. వివరాల్లోకి వెళితే, గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3వ తేదీన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరగాల్సి ఉంది. అయితే, తాజా నిర్ణయంతో పోలింగ్ తేదీని నవంబర్ 5వ తేదీకి మార్చారు. అదేవిధంగా, నవంబర్ 5న చేపట్టాల్సిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను నవంబర్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మార్పులకు గల కారణాలను అధికారులు స్పష్టంగా వెల్లడించనప్పటికీ, పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ముందుగా ప్రకటించిన తేదీలతో పోలిస్తే పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు రెండూ రెండు రోజుల ఆలస్యంగా జరగనున్నాయి. ఈ మార్పులను అభ్యర్థులు, అధికారులు, ప్రజలు గమనించాలని ఎన్నికల సంఘం సూచించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లను కొత్త తేదీలకు అనుగుణంగా అధికారులు సవరించుకుంటున్నారు.

బ్యాలెట్ పేపర్ ఎన్నికలు..
కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?: మోదీ

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా స్పందించారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగాయని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి 'మోనోకిల్' ఎమోజీని జతచేశారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. గతంలో ఆ పార్టీ గెలిచిన నాలుగు స్థానాలు కూడా ఈ ఎన్నికల్లో ఉన్నాయి. అయినా ఈసారి ఒక్క చోటా విజయం సాధించలేకపోయింది. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు సీటు దక్కకపోవడం గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ మోదీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ గతంలో ఆరోపణలు చేసింది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతోనే జరిగాయని మోదీ గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదంటూ పరోక్షంగా ఎద్దేవా చేశారు.



గర్భిణి పేరుతో డొనేషన్ అడుగుతూ డబ్బులు వసూలు చేస్తున్న నిందితుడి అరెస్టు



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఇన్‌స్టాగ్రామ్‌లో మహిళ ఫొటోలను అనుమతి లేకుండా వినియోగిస్తూ, వాటి ద్వారా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న నిందితుడిని మావల పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళితే..మావల సిఐ ప్రేమ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్‌లోని బాలాజీనగర్‌కు చెందిన ఒక మహిళ తన మొబైల్‌లో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూస్తుండగా, తాను గర్భవతిగా ఉన్న సమయంలో దిగిన ఫొటోతో కూడిన వీడియోను గుర్తించింది. ఆ వీడియోలో “Donate ₹5” అనే సందేశంతో పాటు క్యూర్ కోడ్ ఉండటాన్ని గమనించింది. సంబంధిత ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను పరిశీలించగా, తనకు తెలియని వ్యక్తి తన ఫొటోలు, వీడియోలను వినియోగిస్తున్నట్లు గుర్తించింది. తన ఫొటోలను బహిరంగంగా ప్రచారం చేస్తూ, ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని బంగి త్రినాధ్ (21), నాగార్జునసాగర్, నల్గొండ జిల్లా వాసిగా గుర్తించి అరెస్ట్ చేశారు.పోలీసుల సూచన: మహిళల ఫొటోలు, వ్యక్తిగత సమాచారాన్ని వారి అనుమతి లేకుండా సోషల్ మీడియాలో వినియోగించడం, నకిలీ అకౌంట్ల ద్వారా ఇతరులను మోసం చేయడం చట్టరీత్యా నేరం. ఇలాంటి ఘటనలు ఎదురైతే బాధితులు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.. సైబర్ నేరాలకు గురైన వారు 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయవచ్చని సిఐ సూచించారు.

ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన సదస్సు



ప్రజాస్ఫూర్తి ,జన్నారం:జన్నారం మండలం కలమడుగు గ్రామంలో బుధవారం రోజున తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ ఎలా పొందడం, పంట రుణాలు ఎలా పొందడం, అవి చెల్లించే విధానం బ్యాంకు ద్వారా ఇస్తున్న సౌకర్యాలను, పలు విషయాలపై మేనేజర్ కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకు ఎకౌంటు నెంబరు, ఓటిపి నెంబరు, ముఖ్యమైన బిల్లులను ఎవరితో పంచుకోకూడదని ఎవరికీ చెప్పకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బొంతల మల్లేష్ , లింగన్న విష్ణుమూర్తి గౌరయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి పుట్టినరోజు సందర్భంగా మొక్క నాటిన నైనిక రజువా



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార , పౌరసంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం పట్టణానికి చెందిన ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా బుధవారం రామవరంలోని శ్రీ సీతారామ హనుమాన్ శివాలయ ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆయన మరెన్నో పుట్టినరోజు వేడుకలను జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.ప్రతి ఒక్కరూ పుట్టినరోజులు, పెళ్లిరోజులు, ఇతర శుభకార్యాల సందర్భంగా మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలియజేయాలని నైనిక కోరారు. ‘అమ్మ పేరుతో ఒక మొక్క’ నాటి ప్రకృతి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతోపాటు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో రక్తదానం.. 140 యూనిట్ల రక్తం సేకరణ



జనగామ, (ప్రజాస్ఫూర్తి): పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జనగామ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వెస్ట్ జోన్ డీసీపీ రాజా మహేంద్ర నాయక్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత, సర్పంచులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేయగా, మొత్తం 140 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడేందుకు ముందుకొచ్చిన యువత, సర్పంచులను పోలీసు అధికారులు అభినందించారు.

అమ్మానాన్న అనాధాశ్రమంలో వృద్ధురాలు మృతి

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని అమ్మానాన్న అనాధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధురాలు వెంకటరమణమ్మ(76) మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వెంకటరమణమ్మ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందింది. ఆశ్రమం ఉపాధ్యక్షుడు సరిపల్లి గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ డి సతీష్ రెడ్డి తెలిపారు.

రద్దయిన రైళ్లు, స్లీపర్ కోచ్‌లు పునరుద్ధరించాలి

*** ఎమ్మెల్యే కూనంనేని**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం: కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని దీర్ఘకాలిక రైల్వే సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, జీఎం సెక్రటరీ మల్లాది శ్రీనివాస్‌లను ఆయన కలిసి పలు సమస్యలపై అందించిన లేఖలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ మున్సిపల్ రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు 22 అడుగుల రైల్వే స్థలాన్ని కేటాయించాలని కోరారు. బూడిదగడ్డ, రైటర్ బస్తీ, రామవరం-గరిమెళ్లపాడులలో ఆర్‌యూబీలు, లెవల్ క్రాసింగ్‌లు నిర్మించాలని, సర్వారంలో రైతుల కోసం అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. హేమచంద్రాపురం బైపాస్‌లో కొత్త ఆర్‌వోబీతో పాటు సింగరేణి మెయిన్ ఆసుపత్రి వద్ద ఉన్న పాత ఆర్‌వోబీని విస్తరించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో రద్దయిన మణుగూరు-కాజీపేట, భద్రాచలం రోడ్-డోర్నకల్, బెల్లాం-మణుగూరు రైళ్లను వెంటనే పునరుద్ధరించాలన్నారు. కాకతీయ ఫాస్ట్ ప్యాసింజర్‌లో స్లీపర్ బోగీలను పునరుద్ధరించడంతో పాటు తిరుపతికి నేరుగా వారాంతపు రైలు నడపాలని విజ్ఞప్తి చేశారు. భద్రాచలం రోడ్ స్టేషన్‌ను ‘కొత్తగూడెం రైల్వే స్టేషన్’గా పేరు మార్చాలని, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరగా రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని కూనంనేని తెలిపారు.

శనగపాటి అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ప్రతిభా పురస్కారం



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టుల ప్రతిభను పోత్సాహమందించేందుకు శనగపాటి అమ్మా నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటేటా నగదు పురస్కారాలు అందించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీనియర్ జర్నలిస్టు శనగపాటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫౌండేషన్ కార్యక్రమాలను వివరించారు. ‘‘ఎల్‌నినో పేదల జీవనంపై ప్రభావం’’ అనే అంశంపై ఈ ఏడాది అక్టోబర్ 30 నుండి నవంబర్ 30 వరకు రాసిన కథనాలను డిసెంబర్ 10వ తేదీలోగా తమ ఫౌండేషన్ చిరునామాకు పంపించాలని సూచించారు. ప్రింట్ మీడియా జర్నలిస్టులు పేపర్ క్లిప్పింగ్‌తో పాటు ఆ రోజు పత్రికను కథనంతో జత చేసి పంపించాలని సూచించారు. అలాగే డిజిటల్ మీడియా విలేకర్లు కథనంతో పాటు వెబ్ సైట్ లింక్‌ను పంపించాలన్నారు. అవార్డుకు పంపేవారు హామీ పత్రం, పాస్‌పోర్టో, చిరుమానుజత చేసి పంపించాలన్నారు. పోటీకి వచ్చిన కథనాలను సీనియర్ జర్నలిస్టులు నామా పురుషోత్తం, కనకం సైదులు ఆధ్వర్యంలో కమిటీ పరిశీలించి ఎంపిక చేస్తుందని తెలిపారు. అవార్డుల ఎంపికలో కమిటీదే తుది నిర్ణయమని, దీనిపై ఎలాంటి ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదని పేర్కొన్నారు. ఎంపిక చేసిన జర్నలిస్టులకు 2028 జనవరిలో అవార్డులను అందచేస్తామన్నారు. ప్రింట్ మీడియా జర్నలిస్టుకు 5000 నగదు బహుమతి, డిజిటల్ మీడియాకు 3000 నగదు బహుమతితో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందచేసి సన్మానించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టు మిత్రులు ఈ పురస్కారానికి తమ కథనాలను టి మీడియా కార్యాలయం, ఆర్టీసీ డిపో వెనుక, మామిళ్ళగూడెం అనే చిరునామాకు పంపించాలని కోరారు. పూర్తి వివరాలకు 98666 45218, 8919710365 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

*** నెలకో కవి సమ్మేళనం నిర్వహణ**

ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నెలకో కవి సమ్మేళనం నిర్వహించి వర్ధమాన కవులను ప్రోత్సహిస్తామన్నారు. ప్రతి నెలా ఏదైనా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందచేస్తామన్నారు. ఈ మీడియా సమావేశంలో జర్నలిస్టుల అవార్డు కమిటీ కన్వీనర్, సీనియర్ జర్నలిస్టు నామా పురుషోత్తం, ఫౌండేషన్ సభ్యులు జి.రామారావు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై కొరడా



*** జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో ఆకస్మిక సోదాలు**

*** పలు డాక్యుమెంట్స్ స్వాధీనం, 18 కేసులు నమోదు**

ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :రైతులు, అమాయక ప్రజల నడ్డి విరుస్తూ వారి రక్తాన్ని పిండి పీడిస్తున్న వడ్డీ వ్యాపారులపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కఠినంగా వ్యవహరిస్తూ, జిల్లాలో ఏకకాలంలో 13 మండలాలలో 25 బృందాలచే ఆకస్మిక దాడి నిర్వహించారు. ప్రజల వద్ద వడ్డీ పేరుతో వారి నడ్డి విరుస్తూ ప్రజల రక్తాన్ని పిండి పీలుస్తున్న అక్రమ వ్యాపారస్తుల గుండెల్లో ప్రశాంతత లేకుండా జిల్లా ప్రజలకు న్యాయం చేసే విధంగా జిల్లా పోలీసు యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ వ్యాపారాలు నిర్వహించకుండా కఠినమైన చర్యలు తీసుకుంటూ కేసులు నమోదు చేస్తూ వారి ఆటలను కట్టడి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఆసాంఘిక కార్యకలాపాలను రూపుమాపడమే తధ లక్ష్యమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం ఏకకాలంలో 13 మండలాలలో 25 బృందాలచే దాడులు నిర్వహించగా 18 కేసుల నమోదు అయినట్లు వివరించారు. వడ్డీ వ్యాపారుల వద్ద నుండి ప్రామిసరీ నోట్లు, బ్యాంకు చెక్కులు, రిజిస్ట్రార్లు, స్థలాల ఇళ్ళ డాక్యుమెంట్లు, వంటి వాటిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అమాయక ప్రజలను మోసం చేస్తూ ప్రజల అవసరాలకు అధిక వడ్డీలను వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసులు నమోదు అయిన వారిపై ఆయా పోలీస్ స్టేషన్లో పరిధిలో సెక్షన్ 3 (5)(బి) తెలంగాణ ఏరియా మనీ లెండర్స్ ఆక్ట్ 1349 కింద కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

భైంసా సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్

*** 2040 అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన**

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి,భైంసా :భైంసా పట్టణ సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ కీలకంగా దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. బుధవారం భైంసా పురపాలక కార్యాలయంలో మాస్టర్ ప్లాన్ అమలుపై రెండో కన్సల్టేటివ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌పై సంబంధిత స్టేక్‌హోల్డర్లతో ఇప్పటికే కలెక్టరేట్‌లో తొలి కన్సల్టేటివ్ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు, ప్రజాప్రతినిధులకు, సంబంధిత వర్గాలకు ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. తాజా గణాంకాల ప్రకారం భైంసా పట్టణ జనాభా సుమారు 60 వేల వరకు ఉందని, భవిష్యత్‌లో జనాభా మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా పట్టణ ప్రణాళిక ఉండాల్సిన అవసరం ఉందన్నారు. 2040 నాటికి పట్టణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రహదారులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, మైదానాలు, పార్కులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అందరి సహకారం, సూచనలతో భైంసా మాస్టర్ ప్లాన్‌ను అమలు చేసి పట్టణ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేద్దామని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మాస్టర్ ప్లాన్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా రూపొందించాలని సూచించారు. ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై ఎవరికైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పారిశ్రామిక, వాణిజ్య, నివాస ప్రాంతాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ మౌలిక వసతుల మెరుగుదలకు మాస్టర్ ప్లాన్ ఎంతో కీలకమని పేర్కొన్నారు.కన్సల్టేటివ్ వర్క్‌షాప్‌లో డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఏడీ అశ్విని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను వివరించారు. పారిశ్రామిక, వాణిజ్య, నివాసజోన్లకు సంబంధించిన పటాలను, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను సమగ్రంగా వివరించారు. ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై పలువురు వ్యక్తం చేసిన సందేహాలను ఆమె నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, వైస్ చైర్మన్ కుతిజా సిద్దికీ, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్, కౌన్సిల్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడి ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలి

*** జిల్లా ఎస్పీని కలిసి న్యాయం కోరిన బాధిత జర్నలిస్టు, తోటి పాత్రికేయులు**

భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):తనపై దాడి జరిగిందని ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని జర్నలిస్టు కుసుమ చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన పలువురు తోటి జర్నలిస్టులతో కలిసి జిల్లా ఎస్పీని కలిశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు అందజేశారు.కుసుమ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న 19వ వార్డు కౌన్సిలర్ తనపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనలో సుమారు రూ.19,500 విలువైన తన రియల్‌మీ ఎక్స్2 సెల్‌ఫోన్ ధ్వంసమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సైతం అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు. జర్నలిస్టులపై దాడుల ఘటనలను తీవ్రంగా పరిగణించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పాత్రికేయులకు రక్షణ కల్పించాలని తోటి జర్నలిస్టులు విజ్ఞప్తి చేశారు.

రజక సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు ఇవ్వండి

*** ఎమ్మెల్యే ని కలిసిన కల్లూరు గ్రామస్తులు**

ప్రజాస్ఫూర్తి,భైంసా :తమకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ ను కుంటాల మండలంలోని కల్లూరు కి చెందిన రజక సంఘం సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటేల్ మాట్లాడుతూ, దశలవారీగా రజక సంఘ భవన నిర్మాణానికి నిధులు ఇస్తానని చెప్పారు.అందరు కలిసి ఐక్యంగా ఉండి అభివృద్ధి చెందాలని సూచించారు. వారితో కాసేపు మాట్లాడుతూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.వీరి వెంట కుంటాల మండల బిజెపి నాయకులు నవీన్ తో పాటు, వార్డ్ సభ్యులు, రజక సంఘం నాయకులు ఉన్నారు.

బోనాలతో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల నిరసన



జయశంకర్ భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎన్‌హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారానికి 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు బోనాలతో నిరసన కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి తమ ఆందోళనను తెలియజేశారు.ఈ నిరసనకు మాజీ శాసనసభ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి సంఘీభావం ప్రకటించారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఎన్‌హెచ్ఎం జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు బడితల రమేష్, ప్రధాన కార్యదర్శి మధు, ఉపాధ్యక్షుడు డాక్టర్ రఘురాం, సలహాదారులు శ్రీనివాస్, ప్రభాకర్, జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్, డాక్టర్ జగదీష్, మీడియా ఇన్‌ఛార్జి రాజు, డాక్టర్ విజయ్, డాక్టర్ బాలకృష్ణ, కృష్ణవేణి, పార్వతితో పాటు ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మసీ అధికారులు పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తూ గుండెపోటు.. ఫ్లైఓవర్‌పై వ్యక్తి మృతి

జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని సిద్దిపేట ఫ్లైఓవర్ పై విషాదం చోటు చేసుకుంది.బైక్‌పై వెళ్తున్న బచ్చన్నపేట మండలం ఇటికాలపల్లికి చెందిన బోడ లింగయ్యకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలి మృతి చెందారు. వెంటనే స్పందించిన తోటి వాహన దారులు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు లింగయ్యను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

*** కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి,భైంసా : రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందించడంతో పాటు,ప్రాణనష్టాన్ని నివారించే లక్ష్యంతో పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీఎం రాహత్ (ప్రైమ్ మినిస్టర్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలైజేషన్ అండ్ అస్యూర్డ్ ట్రీట్‌మెంట్) పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పథకం అమలులో నిర్లక్ష్యం వహించకుండా, బాధితులకు సత్వర చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పథకానికి సంబంధించిన పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ, అమలును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో రవాణా శాఖ అధికారులు తిరుపతి, అసీఫ్, రజినీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన అవసరం

*** ఓబుల్ కేశ్వాపూర్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు**



జనగామ, ప్రజాస్ఫూర్తి : బాలబాలికల రక్షణ,హక్కులపై అవగాహన కల్పించే దుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఓబుల్‌కేశ్వా పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సద స్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యా యమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శంకర శ్రీదేవి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్ మంచాల రవీంద ర్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాల బాలికలను లైంగిక వేధింపుల నుంచి రక్షించేందుకు పోక్సో చట్టం అమలులో ఉందని వివరించారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు పడ తాయని, బాధితుల రక్షణకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేసినట్లు తె లిపారు. విద్యార్థులు తమ హక్కుల పై అవగాహన కలిగి ఉండాలని, వేధింపు లు ఎదురైతే భయపడకుండా తల్లిదం డ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకె ళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వా సుదేవరెడ్డి, పీఎల్‌వీ పి.జితేందర్, ఉపా ధ్యాయుడు నరసింహారెడ్డి, ఉపాధ్యా య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయానికి ఐక్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే పల్లా.



జనగామ, ప్రజాస్ఫూర్తి : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు విభేదా లను పక్కనపెట్టి ఐక్యంగా పనిచేయాల ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో లింగాల ఘణపు రం, రఘునాథపల్లి మండలాల నాయ కులు,కార్యకర్తలతో నిర్వహించిన సమీ క్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించి, దరఖాస్తుల ఆమో దం వరకు బాధ్యతగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో స్టేషన్ ఘపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయా కర్ రావు, నాగూర్ల వెంకటేశ్వర్లు తదిత రులు పాల్గొన్నారు.

టీజీవో జిల్లా కార్యదర్శిగా అజర్ షరీఫ్, కోశాధికారిగా నగునూరి శ్రీనివాసరావు ఏకగ్రీవ ఎన్నిక





భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) జయశంకర్ భూపాల పల్లి జిల్లా నూతన కార్యదర్శిగా అజర్ షరీఫ్, కోశాధికారిగా నగునూరి శ్రీనివాస రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో టీజీవో జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశంలో సంఘంలో ఖాళీగా ఉన్న కార్యదర్శి పోస్టు భర్తీతో పాటు కార్యవర్గంలో మార్పులు చేపట్టారు. ఇప్పటివరకు జిల్లా కోశాధికారిగా పనిచేస్తున్న అజర్ షరీఫ్‌ను కార్యదర్శిగా, వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న నగునూరి శ్రీనివాసరావును కోశాధికారిగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి నాయకులు, సభ్యులు సమన్వయంతో ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీజీవో జిల్లా నాయకులు, ప్రతినిధులు, గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

గిరిజన రైతుల అభివృద్ధే లక్ష్యం

*** కె.వి.కె శాస్త్రవేత్త సిహెచ్ నరేష్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : రైతుల అభివృద్ధే లక్ష్యంగా గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం పనిచేస్తుందని ఆ సమస్త ఉద్యాన శాస్త్రవేత్త సిహెచ్ నరేష్ తెలిపారు. మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గిరిజన రైతులకు బుధవారం యాసంగి కూరగాయల పెంపకం, మిరప సాగుపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాదులోని ఐ సి ఏ ఆర్, ఏటి ఏ ఆర్ ఐ, జోన్ 10 సహకారంతో గిరిజన ఉప ప్రణాళిక కింద నిర్వహించిన ఈ కార్యక్రమంలో బోటియా తండకు చెందిన 20 మంది గిరిజన రైతులకు ఉచితంగా కూరగాయలు, మిరప నారు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తీవ్రంగా తగ్గిందన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా, జిల్లావ్యాప్తంగా నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేపట్టే పద్ధతులను అనుసరించాలని ఆయన సూచించారు. ప్రధానంగా బిందు సేద్యం, మల్చింగ్ పద్ధతులను అవలంబించడం ద్వారా నీటిని ఆదా చేయడంతో పాటు కలుపు మొక్కల సమస్యను తగ్గించుకోవచ్చని వివరించారు. కూరగాయల పెంపకం, మిరప పంటల్లో సమతుల్య ఎరువుల వినియోగం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, చీడ పీడల నివారణకు అవలంబించాల్సిన శాస్త్రీయ యాజమాన్యం పద్ధతుల పై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. రైతులు భూమి స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, సాగు ఖర్చులను తగ్గించుకుంటూ నాణ్యమైన దిగుబడులు సాధించాలని సూచించారు. గిరిజన రైతులకు నాణ్యమైన నారు మొక్కలను అందించడంతోపాటు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించడం ద్వారా కూరగాయలు, మిరప సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. నీటి పొదుపు పద్ధతుల అమలను పెంపొందించడం, రైతుల జీవనోపాధిని మెరుగుపరచడం కోసం ఇటువంటి కార్యక్రమాలను కెవికి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గిరిజన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కూరగాయలు మిరప సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఆయన కోరారు. ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా లోని ఆత్మకూరు ఎస్ మండలం బొట్య తండా కు చెందిన 20 మంది గిరిజన రైతులకు టమాట, వంకాయ, పచ్చిమిరప, ఎర్ర మిరప పంటల సాగు కోసం అవసరమైన నారు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు అర ఎకరం చొప్పున సాగు చేసుకునే విధంగా మొక్కలను అందించి సుమారు పది ఎకరాల్లో సాగు చేసుకునే విధంగా కేవీకే ఆధ్వర్యంలో శిక్షణ పొందిన రైతులకు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త ఈ ఆదర్, గృహ విజ్ఞాన విభాగం సహాయకురాలు ఎన్ సుగంధి, కెవికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుద్ర సహిత కాలభైరవ మహా యజ్ఞం

*** డిసెంబర్ 1న 1116 మంది దంపతులచే నిర్వహణ**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:హిందూ ధర్మం లో ప్రతి హిందువు సంవత్సరానికి ఒక్కసారైనా యజ్ఞం వ్రతం నిర్వహించాలని వేదాలు చెబుతున్నాయని ఏ హోమము,వ్రతాలు చేయలేని భక్తజనులు, పేదల కోసం సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీ బాల మానస మహా విద్యాపీఠం ఆధ్వర్యంలో శ్రీ రుద్ర సహిత కాలభైరవ మహా యజ్ఞం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ సద్గురు భవాని స్వామీజీ తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని యర్రం శెట్టి ఉపేందర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహా యజ్ఞం కు సంబంధించిన వివరాలను స్వామీజీ వెల్లడించారు. యజ్ఞ యాగాదుల ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆ ఖర్చులను భరించలేక యజ్ఞాలు యాగాలు కుంటుపడుతున్నాయని అన్నారు. సమాజ శ్రేయస్సు కోరి మానవ కర్మలను తొలగించేందుకు గురువు శ్రీశ్రీశ్రీ పరమహంస పరిరాజాకాచార్యులు శ్రీ శ్రీ సుదర్శన ఆశ్రమ స్వామిజి ఆశీస్సులతో ఎనిమిది మహా యాగాలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం తొమ్మిదవ సారి డిసెంబర్ 1, 2026లో 1116 మంది దంపతులచే శ్రీ రుద్ర సహిత కాలభైరవ మహా యజ్ఞాన్ని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తిరుమల నగర్ రోడ్ నెంబర్ 24, 100 ఫీట్ల కలెక్టరేట్ రోడ్ అమ్మ గార్డెన్ ఎదురుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి పేదవాడికి అందుబాటులో ఉండే విధంగా ప్రతి ఒక్కరు ఈ యజ్ఞంలో పాల్గొనేలా కేవలం 1516 రూపాయలు చెల్లించి హోమంలో పాల్గొనే అవకాశాన్ని తమ ట్రస్టు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ జహీర్, నాయకులు సలిగంటి వీరేందర్, యర్రంశెట్టి ఉపేందర్ తులసి, సంకురిశెట్టి పరమేష్ సబిత, ప్రసాదు, వాసుదేవరావు సరళ, ఆనందరావు అనిత, శ్రీనివాస్ రెడ్డి ఉమా, సంజీవరెడ్డి ఉదయ శ్రీ ,శ్రీనివాస్ రెడ్డి పద్మ , రాంరెడ్డి రమ, వెంకట్ రెడ్డి కళావతి, శ్రీనివాసరావు శిల్ప, లక్ష్మారెడ్డి సంధ్య, ట్రస్టు సభ్యులు జెట్టి రవికుమార్, రాజిరెడ్డి, శ్రావణ్ కుమార్, క్రాంతికుమార్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో డీటీడీఓ తనిఖీ

*** విద్య, వసతి సౌకర్యాలపై నాగసాగర్ ఆరా**



జయశంకర్ భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):గిరిజన విద్యార్థినులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్ సూచించారు. బుధవారం భూపాలపల్లి పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను (టీడబ్ల్యుఎహెచ్ఎస్-బాలికల) ఆయన సందర్శించి విద్యా, వసతి సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం, తరగతి గదుల నిర్వహణ, బోధనాభ్యసన కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో మాట్లాడి చదువులో పురోగతి, సబ్జెక్టులపై అవగాహన, ఎదురవుతున్న సమస్యల గురించి ఆరా తీశారు. అనంతరం వసతి గృహాన్ని పరిశీలించి తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, భోజనశాల, వంటగది నిర్వహణను తనిఖీ చేశారు. నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు.పదో తరగతి విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రణాళికాబద్ధంగా బోధన నిర్వహించి మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల, వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమ్మయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత యువతే లక్ష్యం



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):పొగాకు ఉత్పత్తుల వినియోగంతో కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 60 రోజులపాటు నిర్వహించే టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్-4.0 కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపాలపల్లిలోని మైనారిటీ గురుకుల కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ దేవేందర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు పొగాకు వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, పోలీసుశాఖల సమన్వయంతో ఎనిమిది వారాలపాటు వివిధ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.మొదటి రెండు వారాల్లో అవగాహన కార్యక్రమాలు, మూడు, నాలుగు వారాల్లో విద్యాసంస్థల్లో పొగాకు నిషేధ సూచిక బోర్డుల ఏర్పాటు, ఐదు, ఆరు వారాల్లో గ్రామపంచాయతీల సహకారంతో పొగాకు రహిత గ్రామాల గుర్తింపు, ధ్రువపత్రాల అందజేత చేపడతామన్నారు. చివరి రెండు వారాల్లో పోలీసుశాఖ సహకారంతో నిబంధనల అమలుపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నాగరాణి, వైద్యాధికారి డాక్టర్ రోహిణి, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్లు మురళీధర్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణతోనే బంగారు భవిష్యత్తు

*** ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు**



జయశంకర్ భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): బాలల పరిరక్షణతోనే దేశానికి బంగారు భవిష్యత్తు సాధ్యమని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి తాడూరు మహతి వైష్ణవి అన్నారు. జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సురక్షిత్ బచ్‌పన్ అభియాన్‌లో భాగంగా బుధవారం జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.భూపాలపల్లి మండలం గోర్లవీడు ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మహతి వైష్ణవి మాట్లాడుతూ పోక్సో నేరాల నివారణ, సైబర్ మోసాల నుంచి పిల్లలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే వీటిపై అవగాహన పెంచుకోవాలని, మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు.కొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. పెద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల మాట్లాడుతూ ప్రతి చిన్నారి బాల్యాన్ని పరిరక్షించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. పిల్లలకు తమ హక్కులు, సహాయం పొందే మార్గాలపై అవగాహన కల్పించడమే ఈ ప్రచారం లక్ష్యమని తెలిపారు.కార్యక్రమాల్లో జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకటస్వామి, సూపరింటెండెంట్ రఘురాం, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది అంబాల దేవేందర్, గోపాల్, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ విధులపై విద్యార్థులకు అవగాహన



మేడ్చల్, (ప్రజాస్ఫూర్తి): విద్యార్థులకు పోలీసుల విధులు, పోలీస్ స్టేషన్‌లో జరిగే కార్యకలాపాలపై అవగాహన కల్పించేందుకు మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. అత్యవసర సమయాల్లో పోలీసులను ఎలా సంప్రదించాలి, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, రహదారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండటం, బాలల భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా విద్యార్థులకు సూచనలు చేసినట్లు తెలిపారు. పోలీస్ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు.

గరిడేపల్లి 108 అంబులెన్సులో తనిఖీలు

*** అత్యవసర వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి.. పరికరాల పనితీరు పరిశీలన**



గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి:సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కేంద్రంలో 108 అంబులెన్సు బుధవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అంబులెన్సులోని వైద్య పరికరాలు, అత్యవసర చికిత్సకు ఉపయోగించే సామగ్రి, వాటి పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.అంబులెన్సులో అందుబాటులో ఉన్న ఆక్సిజన్ సిలిండర్లు, ప్రథమ చికిత్సకు అవసరమైన వైద్య సామగ్రి, రోగుల ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగించే అత్యవసర వైద్య పరికరాల పనితీరును అధికారులు పరిశీలించారు..అంబులెన్సులో అవసరమైన వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉండేలా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడం ద్వారా అత్యవసర వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచవచ్చని తెలిపారు. అంబులెన్సు సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోగులకు అందించే సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు.ఈ తనిఖీల్లో క్వాలిటీ హెడ్ ఆఫీస్ కిషోర్, ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎస్.కె సలీం, సూర్యాపేట జిల్లా అధికారి ఎల్లవుల మధు, అంబులెన్సు సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణంలో అంగన్వాడీ

- సర్పంచ్ గిర్కాటి నిరంజన్ గౌడ్



చౌటుప్పల్,ప్రజాస్ఫూర్తి: ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ చిన్నారులకు ఉపయుక్తంగా ఉంటుందని సర్పంచ్ గిర్కాటి నిరంజన్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలో గ్రామపంచాయతీ నిధులతో పునరుద్ధరించిన అంగన్వాడి కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గిర్కాటి నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో దెబ్బతిన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామ పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయించామన్నారు. చిన్నారులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో అంగన్వాడీ అందుబాటులోకి తెచ్చామన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు సుంకరి విజయ్‌కుమార్ గౌడ్, పొట్లపల్లి శివశంకర్ గౌడ్, సంగెం రవితేజ, ఒంటెడు రాజు, కొత్త మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ సిఐ సతీష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ సిఐగా సతీష్ రెడ్డి బాధ్యతలు ఇటీవల చేపట్టిన విషయం విదితమే. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చౌటుప్పల్ సిఐ సతీష్ రెడ్డిని మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను బహుకరించారు. శాలువాతో సత్కరించి, ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మాజీ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మ గౌడ్, చౌటుప్పల్ కో ఆప్షన్ సభ్యుడు పస్తం గంగరాములు, ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, మునుకుట్ల సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

*** అంకిరెడ్డిగూడెంలో ఎల్ నినో ప్రభావం - తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు**

*** సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నీటిని వృధా చేయకుండా.. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలో ఎల్ నినో ప్రభావం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిని, విద్యుత్ ను పొదుపుగా వాడాలని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ఏల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలో భాగంగా నీటి వృధాను పూర్తిగా అరికట్టాలన్నారు. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి రాబోయే విపత్తుకు ముందస్తు జాగ్రత్త వహించాలన్నారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గించి, పొదుపుగా వాడుకోవాలన్నారు. అదేవిధంగా వి బి జి రామ్ జి ద్వారా ప్రతి ఇంటికి ఇంకుడు గుంటలు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ సత్యనారాయణ, ఏపీవో ఈశ్వరయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ విశాల్ రెడ్డి, పశువైద్యాధికారి శ్రీధర్ రెడ్డి, ఏఈవో వీణ, సభ్యులు బత్తుల అనుష మహేష్ గౌడ్, దొడ్ల అండాలు శెట్టయ్య గౌడ్, దండుగల వెంకటేశం, బొమ్మని శ్రావణి స్వామి గౌడ్, మాజీ సర్పంచ్ సుర్వి సత్తయ్య గౌడ్, పర్నె శ్రీనివాస్ రెడ్డి, పర్నె శ్రీధర్ రెడ్డి, ముద్దం మల్లయ్య, ముద్దం బిక్షమయ్య, సుర్వి నర్సింహ, దాసు గౌడ్, సత్తయ్య గౌడ్, ఇరగదిండ్ల నర్సింహ్మ, బొమ్మని సత్తయ్య, శ్యామల నర్సింహ్మ, ముద్దం భారతి, భీమగోని శోభ, అంగన్వాడీ టీచర్స్, పెండెం. లక్ష్మమహిళా సంఘం అధ్యక్షురాలు, ముద్దం. మంజుల, రైతులు యువకులు, మహిళలు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించిన ఎమ్మార్వో భూపాల్



మేడ్చల్, (ప్రజాస్ఫూర్తి): మేడ్చల్ మండలం పూడూరు-కిష్టాపూర్ డివిజన్ పరిధిలోని గోసాయిగూడ గ్రామంలో బుధవారం భూ భారతి కార్యక్రమంలో భాగంగా భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఎమ్మార్వో భూపాల్ ఆధ్వర్యంలోనిర్వహించిన ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు, మండల సర్వేయర్ వినోద్, ఆర్ఐ చందన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, సర్వే నంబర్ల వారీగా భూముల రీ సర్వే ప్రక్రియ, భూములకు సంబంధించిన వివరాలు, భూ రికార్డుల ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. భూ సర్వేకు సంబంధించిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. భూముల వివరాలు, సర్వే ప్రక్రియపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు రేగు మహేష్‌తో పాటు గ్రామస్తులు బోదారి అశోక్, బి. నాగేశ్, ఎం. శంకర్, జి. కృష్ణ, పుట్నాల రాజు, రేగు ప్రభాకర్, బి. దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బైంసా లో మాస్టర్ ప్లాన్ అమలు పై వర్క్ షాప్

*** సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే పవర్ రామరావ్ పటేల్**



ప్రజాస్ఫూర్తి,బైంసా:బైంసా పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలుకు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మోల్ల దత్తాత్రి అధ్యక్షతన మాస్టర్ ప్లాన్ అమలుపై రెండో కన్సల్టేటివ్ వర్క్ షాప్ ను నిర్వహించారు.కన్సల్టేటివ్ వర్క్ షాప్ లో డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఏడి అశ్విని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముసాయిదా మాస్టర్ ప్లాన్ ను వివరించారు. మాస్టర్ ప్లాన్ వల్ల భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలు ఏ విధంగా ఉంటాయో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవిశ్ మీశ్రా మాట్లాడుతూ బైంసా పట్టణ సమగ్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ కీలకంగా దోహదపడుతుందని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, పెరుగుతున్న జనాభా ను దృష్టిలో ఉంచుకొని మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పవర్ రామరావ్ పటేల్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ వస్తే బైంసా పట్టణానికి మరింత నిధులు వస్తాయని, కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ ద్వారా 100 కోట్ల నిధులు రానున్నట్లు చెప్పారు. మాస్టర్ ప్లాన్ అమలు చేసి బైంసా పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ఇందులో ఎలాంటి అపోహలకు తావివ్వ వద్దని, అనవసర పుకార్లు నమ్మవద్దని సూచించారు. మాస్టర్ ప్లాన్ లో భవిష్యత్తు తరాల దృష్ట్యా రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణం, విద్యా వ్యవస్థ, రింగ్ రోడ్డు నిర్మాణం, ఇతర విషయాలను పొందుపరుస్తారన్నారు. వ్యవసాయ భూములకు, ఇతర భూములకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. మాస్టర్ ప్లాన్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా రూపొందించాలని ఆయన అధికారులకు సూచించారు. ముసాయిదా మాస్టర్ ప్లాన్ పై ఎవరికైనా సందేహాలు అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పారిశ్రామిక వాణిజ్య నివాస ప్రాంతాలను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ తూమో ల దత్తాత్రి మాట్లాడుతూ బైంసా పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమన్నారు.సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కుదిజా సిద్ధికి, సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్, ఏ ఎస్ పి సాయి కిరణ్, మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్ తో పాటు, కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్ ను పాడు చేసుకోవద్దు


*** ఇండియన్ రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా చైర్మన్ ఏ.వి. రావు**



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్ ను పాడు చేసుకోవద్దని ఇండియన్ రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా చైర్మన్ ఏ.వి. రావు సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు , జిల్లా అధ్యక్షుల ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బహదూర్ పల్లిలో గల కె.ఎం. పాండు మెమోరియల్ గవర్నమెంట్ వోకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం మత్తు పదార్థాల వల్లకలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా చైర్మన్ ఏవి రావు , నరసింహారెడ్డి,కోటి ధర్మతేజ, రామకృష్ణ , రవికుమార్ ,వెలుగు ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నారాయణరావు లు పాల్గొని మాదక ద్రవ్యాల వ్యతిరేక నినాదాలు, మాదకద్రవ్యాల రహిత సమాజం మన అందరి బాధ్యత, మత్తు పదార్థాలకు దూరం, విజయానికి మార్గము, డ్రగ్స్ కి బానిస కావొద్దు. మీ జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. డ్రగ్స్ ని వదిలివేయండి మీ కళలను నిజం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం హైదరాబాద్ జిల్లా చైర్మన్ ఏవి రావు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడడంతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ మైమున్ విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ అనేది జీవితానికి పునాది వేసుకునే బంగారు మార్గం, మీ జీవితంలో ఎప్పుడు అయినా, ఎవరు డ్రగ్స్ తీసుకోమని ప్రోత్సహిస్తే, ధైర్యంగా నో అని చెప్పాలన్నారు. చెడు స్నేహాలకు దూరం ఉండండి, మంచి స్నేహితులను ఎంచుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండడమే కాకుండా, ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు.మన కళాశాలను మన సమాజాన్ని మాదక ద్రవ్యాల రహితంగా మార్చడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం కదిలిన ఇన్మల్ నర్వ గ్రామ ప్రజలు

*** డంపింగ్ యార్డు రద్దు చేసే వరకు జేఏసి తో కలసి నడుస్తాం.**



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్ :సిద్దాపూర్ డంపింగ్ యార్డు జీవో 641 రద్దుకోసం జేఏసి ఆధ్వర్యంలో 25 రోజులుగా జరుగుతున్న నిరవధిక రిలే నిరాహార దీక్షలకు ఇన్మల్ నర్వ గ్రామ సర్పంచ్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు తరలి వచ్చి నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్మల్ నర్వ గ్రామ సర్పంచ్ గోపాల్ నాయక్ మాట్లాడుతూ సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం సమరశీల పోరాటాలు చేయటానికి సిద్ధంగా ఉన్నామని, జీవో రద్దుఆయ్యేవరకు ఉద్యమానికి మద్దతు గా ఉంటామని తెలిపారు. జేఏసి నాయకుల అడుగు జాడల్లో వాళ్ళు ఇచ్చే కార్యాచరణను చిత్త శుద్ధితో అమలు చేయాలని కోరారు. ఇన్మల్ నర్వ మాజీ సర్పంచ్ మిట్టూ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇక్కడి అధికారం పార్టీ నాయకులు ఉద్యమాన్ని చీల్చాలని ఎన్ని ప్రయత్నాలు జిమ్మిక్కులు చేసినా ఉద్యమం మరింత తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితులలో ఈ డంపింగ్ యార్డును రానివ్వబోమని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజా పోరాటం ఉవ్వెత్తున సాగుతుందని తెలిపారు. జేఏసి తో కలిసి ముందుకు సాగుతామని చెప్పారు. ఇన్మల్ నర్వ మాజీ సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ డంపింగ్ యార్డు రద్దుకొరకు నిర్విరామంగా పోరాటం చేస్తున్న జేఏసి నాయకులకు ఉద్యమాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ రాంబల్ నాయక్, కో చైర్మన్ లు శ్రీనివాస్ రెడ్డి, బాలయ్య, కో కన్వీనర్ మహేష్, సిద్దాపూర్ గ్రామ జేఏసి అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీధరా చారి, నాయకులు నరేందర్ రెడ్డి, మహేష్ , మరియు ఇన్మల్ నర్వ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్య వైశ్య మహాసభ

సేవాదళ్ కోశాధికారిగా బెజుగం రమేష్



ప్రజాస్ఫూర్తి,షాద్నగర్:తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ సేవాదళ్ రాష్ట్ర కోశాధికారిగా షాద్‌నగర్‌కు చెందిన బెజుగం రమేష్ నియమితులయ్యారు. సామాజిక, ఆధ్యాత్మిక, కుల సంఘాల కార్యక్రమాల్లో కొన్నేళ్లుగా చురుగ్గా పాల్గొంటూ సేవా కార్యక్రమాల్లో తనవంతు సహకారం అందిస్తున్న రమేష్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. బెజుగం రమేష్‌పలు యజ్ఞయాగాదులు, ఆధ్యాత్మిక, కళా, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు, విద్య, వైద్య రంగాలతో పాటు దేవాలయాల అభివృద్ధికి సహకరిస్తూ వస్తున్నారు. అలాగే అన్నదాన, వస్త్రదాన కార్యక్రమాలకు ఇతోధిక సహాయ సహకారాలు అందిస్తూ మంచి మనసున్న వ్యక్తిగా, సామాజిక సేవాతత్పరుడిగా గుర్తింపు పొందారు. సమయపాలన, అంకితభావం, పనిపట్ల నిబద్ధత, ఖచ్చితత్వం, నిస్వార్థ సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ సేవాదళ్ రాష్ట్ర కోశాధికారిగా రమేష్‌ను నియమించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్కార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు టీ.వీ. రంగయ్య, సంస్కార భారతి రంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు, ప్రముఖ కళాకారులు, సామాజిక సేవకులు డాక్టర్ కే. రంగనాథం, జిల్లా అధ్యక్షులు, హాజిపల్లి మాజీ సర్పంచ్ సింగారం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రముఖ నృత్య కళాకారులు శివ మాస్టర్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లికార్జున గౌడ్, దాస సత్యనారాయణ, సంస్కార భారతి జిల్లా గౌరవ సలహాదారు నవోదయ సేవాశ్రీ జీ. రంగారెడ్డి, కుటుంబ సభ్యులు, ఆత్మీయ మిత్రులు, శ్రేయోభిలాషులు, కళాకారులు రమేష్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. రమేష్ ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి మరింత సేవ చేయాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు, గౌరవ సత్కారాలు అందుకోవాలని వారు ఆకాంక్షించారు.

బచ్చన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్షిత ప్రసవం.. మగ శిశువు జననం



జనగామ, (ప్రజాస్ఫూర్తి): బచ్చన్నపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సతో పాటు సాధారణ ప్రసవం విజయవంతంగా నిర్వహించారు. తమ్మడపల్లి గ్రామానికి చెందిన కొరిపల్లి రమకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయగా, కరై మోనికకు మధ్యాహ్నం 1.17 గంటలకు సాధారణ ప్రసవం ద్వారా 2.8 కిలోల బరువున్న మగ శిశువు జన్మించాడు. జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ సంధ్యా జి. పాల్గొనగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గీతారాణి పర్యవేక్షణలో గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రశాంతి, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ సహస, శిశు వైద్య నిపుణులు డాక్టర్ కనకరాజు, డాక్టర్ సృజన్, డాక్టర్ రాజేష్‌తో పాటు నర్సింగ్ సిబ్బంది వైద్య సేవలు అందించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ సురక్షిత ప్రసవాలు, కుటుంబ నియంత్రణ సేవలు అందిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వద్దు

*** అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొను గోలు కేంద్రాన్ని జి ల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షా లోమ్ బుధవారం సందర్శించి పరిశీలిం చారు. ఈ సందర్భంగా కేంద్రంలో రైతు లు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి, సరిపడా టార్పాలిన్లు అం దుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కాంటా పూ ర్తయిన వెంటనే రైస్ మిల్లులకు తరలిం చాలని, ఓపీఎంఎస్ లో వివరాలను ఎ ప్పటి కప్పుడు నమోదు చేయాలని కేం ద్ర నిర్వాహకులను ఆదేశించారు. కొను గోళ్లలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని స్పష్టం చేశారు. అనంతరం కొనుగోలు రిజిస్టర్లను తనిఖీ చేసి, సంబంధిత అధి కారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రజా సేవతో పాటు కష్టసమయంలో అండగా నిలవడం మన బాధ్యత

*** చైర్ పర్సన్ జ్యోతి రమేష్ నాయక్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ పట్టణంలోని ఈదులపూసపల్లి 1వ వార్డు కౌన్సిలర్ ధూపాటి స్పందన వినయ్ తల్లి ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు.ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో, బుధవారం చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ,ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు,కష్టసమయంలో అండగా నిలవడం కూడా ప్రజాప్రతినిధుల బాధ్యత అన్నారు.ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ నీరుటి హైమ లక్ష్మీనారాయణ,32వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఖలీల్,2వ వార్డు కౌన్సిలర్ అంబాల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో జాప్యం వద్దు నిర్దేశిత లక్ష్యాలను వేగంగా పూర్తి చేయండి

*** కలెక్టర్ స్నేహ శబరిష్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వీడి,నిర్దేశిత లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ లో బుధవారం ఇందిరమ్మ ఇండ్లు, తాగునీటి సరఫరా, వీబీజీ రాంజీ పథకాలపై ఆమె సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వీబీజీ రాంజీ పథకం కింద జాబ్ కార్డుదారులందరికీ పని దినాలు కల్పించాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను దశలవారీగా వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. నాణ్యతలో రాజీ పడవద్దని,తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పనుల్లో నిర్లక్ష్యం వహించే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, హౌసింగ్ పీడీ పురుషోత్తం, డీఆర్డీఓ మధుసూదనరాజు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పీఆర్, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలో బీఆర్ఎస్ జెండా ఎగరేద్దాం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రైవేటు ఉపాధ్యాయులు సహకరించాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు.జిల్లా కేంద్రంలోని గాదె రుక్మారెడ్డి మెమోరియల్ హైస్కూల్లో బుధవారం ప్రైవేటు ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ తో కలిసి ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ప్రైవేటు విద్యాసంస్థల కృషి మరువలేనిదన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదైన ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఇంకా నమోదు కాని అర్హులు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ, ప్రైవేటు ఉపాధ్యాయులు గ్రామీణ విద్యాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కమ్మగాని కృష్ణమూర్తి గౌడ్,డైరెక్టర్ వీణ గోపి కృష్ణ, ప్రైవేటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి

*** మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ రాహుల్ శర్మ**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. బుధవారం గణపురం మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాబోధన, విద్యార్థుల హాజరు, ప్రయోగశాలలు, మధ్యాహ్న భోజనం, వసతి సౌకర్యాలను పరిశీలించారు. అన్ని తరగతుల్లో వందశాతం హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ముఖ గుర్తింపు ఆధారిత హాజరును తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యుత్ పరికరాలకు మరమ్మతులు అవసరమైతే వెంటనే చేయించాలని సూచించారు.విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్ తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై బీజేపీ సమీక్ష

*** ఓటర్ల నమోదు ప్రక్రియపై వీరేందర్‌గౌడ్ ఆరా**



కూకట్పల్లి,
ప్రజాస్ఫూర్తి:మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. వీరేందర్‌గౌడ్ సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జిగా ఆయన నియమితులైన నేపథ్యంలో, ఉమ్మడి వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాగ్ అమీర్‌లో డివిజన్ అధ్యక్షుడు ఎన్. వంశీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికుమార్ యాదవ్‌తో కలిసి ఓటర్ల నమోదు పురోగతిని సమీక్షించారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశమై ఎన్నికల సన్నద్ధత, ఓటర్ల నమోదుపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి రవీందర్‌రావు, మహిపాల్‌రెడ్డి, స్రవంతి, భాస్కర్‌రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శులు రేపన్ రాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

20 రోజులకే చిరిగిన మల్చింగ్ కవర్లు!

*** మిరప రైతులకు రూ.20 వేల నష్టం.. కంపెనీ స్పందించడం లేదని ఆవేదన**





జయశంకర్ భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): మిరప సాగులో కలుపు నివారణ,తేమ సంరక్షణ కోసం వినియోగించిన మల్చింగ్ కవర్లు 20 రోజులకే చిరిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూపాలపల్లి మండలం దూదేకులపల్లి, గొల్లబుద్ధారం తదితర గ్రామాల్లో ఎబిగ్రీన్ జోన్‌అగ్రిమిచ్‌ఇండియా ప్రైవుటు లిమిటెడ్ కంపెనీ కవర్లను సుమారు 100 ఎకరాల్లో వినియోగించినట్లు రైతులు తెలిపారు.ఎకరాకు కవర్ల కొనుగోలుకు రూ.15 వేలు,కూలీలకు రూ.5 వేల వరకు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. కవర్లు దెబ్బతిన్న విషయంపై కంపెనీ ప్రతినిధులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కవర్ల నాణ్యతను పరీక్షించాలని, లోపాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకుని తమకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

సోషల్ మీడియా మోజులో భవిష్యత్తును పాడు చేసుకోవద్దు

*** విద్యార్థులకు జడ్జి స్వాతి మురారి హితవు**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:సోషల్ మీడియా వ్యామోహంలో పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి అన్నారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి మార్గదర్శకత్వంలో, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సురక్షిత బాల్యం అభియాన్ లో భాగంగా మాంటిస్సోరి హైస్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,విద్యార్థి దశ జీవితానికి పునాది అని,స్మార్ట్‌ఫోన్లకు బానిసై విలువైన సమయాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు. తాత్కాలిక ఆకర్షణలకు లోనై భవిష్యత్తును పాడు చేసుకోవద్దని,పోక్సో చట్టం,జువెనైల్ జస్టిస్ యాక్ట్ గురించి వివరించారు. వేధింపులు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు చెప్పాలని, అత్యవసర సహాయం కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098, లీగల్ ఎయిడ్ హెల్ప్ లైన్ 15100 ను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవసాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రూ.1.62 కోట్లతో అభివృద్ధి పనులు

*** పలు భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



భూపాలపల్లి రూరల్,(ప్రజా స్ఫూర్తి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో రూ.1.62 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సమైక్య భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు.రాంపూర్, చికెన్‌పల్లి, దూదేకులపల్లి,నందిగామ, ఆజంనగర్, బూర్కపల్లి,రాజీవ్‌నగర్,ఆముదాలపల్లి, ఎస్ఎం కొత్తపల్లి, శ్యామ్‌నగర్ తదితర గ్రామాల్లో ఈ పనులు చేపట్టనున్నారు. ఒక్కో భవన నిర్మాణానికి సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన సేవలు అందించడం, మహిళా సంఘాలకు అవసరమైన వసతులు కల్పించడం, గ్రామపంచాయతీలకు సొంత భవనాలు నిర్మించడం లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తాం

*** కలెక్టర్ భవేశ్ మిశ్రా**

ప్రజాస్ఫూర్తి, భైంసా :జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు ఓటు హక్కును కోల్పోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా ఫామ్ 6, ఫామ్ 8 దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం, తిరస్కరణకు గల ప్రధాన కారణాలను వివరించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు అందిస్తున్న సహకారం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లువెంకట మాధవ రావు, రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

*** ప్రథమ చికిత్స కేంద్రాలకు డీఎంహెచ్వో హెచ్చరిక**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి రాథోడ్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వైద్య బృందంతో కలిసి బయ్యారం, కురవి,డోర్నకల్ మండలాల్లోని బలుపాల, గంధంపల్లి,డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాజరు పట్టికలు,మందుల నిల్వలు,రికార్డులు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం డోర్నకల్ మండల కేంద్రం స్టేషన్ రోడ్డులోని కలకత్తా మెడికల్స్ కు చెందిన పి.సనత్ కుమార్ నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రథమ చికిత్స కేంద్రాల నిర్వాహకులు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు అనుగుణంగానే సేవలు అందించాలని సూచించారు.అర్హత, అనుమతి లేకుండా రోగులకు ఇంజక్షన్లు వేయడం, సెలైన్లు ఎక్కించడం,సూదుల ద్వారా చికిత్స చేయడం వంటి ప్రక్రియలు చేపట్టరాదని స్పష్టం చేశారు. జ్వరం వంటి సాధారణ సమస్యలకు సూచనలు ఇవ్వడం, బ్యాండేజీ కట్టడం వంటి పరిమిత సేవలకే పరిమితం కావాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల కార్యక్రమంలో బలుపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ స్రవంతి,డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ సాధ్విజ, డాక్టర్ మేఘన, గంధంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఉస్మాన్, సీహెచ్వో జ్ఞాన సుందరి, డిప్యూటీ డీఎంఈఓ రాజకుమార్,డీపీఓ నీలోహన తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు నూతన పనిముట్లను పంపిణీ చేయాలి

*** టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : సింగరేణిలో వివిధ ఏరియాలలో పనిచేస్తున్న కార్మికులకు పనిముట్లు లేక కార్మికుల ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వారికి నూతన పనిముట్లను అందజేయాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ మైన్స్ లలో బిట్లు లేక కోల్ కట్టర్స్, సపోర్టు మెన్స్ ఇబ్బంది పడుతున్నారని , మిషనరీ లకు సంబంధించిన స్పేర్స్ లేక ప్రొడక్షన్ కి ఇబ్బంది కలుగుతుందని , టెక్నీషియన్లకు టూల్స్ ప్రాబ్లం ఉండటంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని , కార్మికులు విధులు సురక్షితంగా , సులభంగా నిర్వహించేందుకు అవసరమైన పనిముట్లను అందించాలని ఆయన డిమాండ్ చేశారు .

కొమురం భీమ్ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

*** జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం, ఆయన త్యాగం నేటి తరానికి ఆదర్శమని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్ అన్నారు. కొమురం భీమ్ 86వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం మహాదేవపూర్‌లోని దుద్దిళ్ల శ్రీపాదరావు ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని భీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాగసాగర్ మాట్లాడుతూ.. నిజాం పాలనలో గిరిజనులు ఎదుర్కొన్న అన్యాయాలు, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా కొమురం భీమ్ ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు. 'జల్-జంగల్-జమీన్' నినాదంతో గిరిజనుల నీరు, అడవి, భూమిపై హక్కుల కోసం ఉద్యమించిన గొప్ప యోధుడని కొనియాడారు. గిరిజనుల జీవన హక్కులు, స్వేచ్ఛ, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.కొమురం భీమ్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజాబాబు, మహాదేవపూర్ సర్పంచ్ హసీనా భాను, సురారం సర్పంచ్ శంకరమ్మ, చల్ల తిరుతయ్య, కురిమెట్ల సమ్మయ్య, పోలం రాజేందర్, మట్టి కృష్ణ, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గిరిజన సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ పైపుల పంపిణీ

*** మైసమ్మ వాగు తండా రైతులకు అందజేసిన ఆత్మ కమిటీ చైర్మన్ జంగాపల్లి ఐలయ్య**



అక్కన్నపేట ,ప్రజాస్ఫూర్తి:రాష్ట్రంలో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన కరువును తట్టుకునేందుకు రైతులు ఆరుతడి పంటలు. పండించుకోవడానికి వీలుగా 60 శాతం సబ్సిడీతో సుధాకర్ కంపెనీకి చెందిన స్ప్రింక్లర్ పైపులను హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని అక్కన్నపేట మండలం మైసమ్మ వాగు తండా గ్రామంలో రైతులకు హుస్నాబాద్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ జంగాపల్లి ఐలయ్య పంపిణి చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య కృష్ణ నాయక్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో ఈ పైపులు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆరుతడు పంటలు పండించుకోవడానికి వీలుగా పైపులను పంపిణీ చేసిన సుధాకర్ కంపెనీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అదే విధంగా గ్రామంలోని 38 మంది రైతులకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి బాలాజీ , లబ్ధిదారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

అక్క పెళ్లి కూడా ప్రాథమిక పాఠశాలను సందర్శించిన మేధా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు



ప్రజాస్ఫూర్తి,జన్నారం:అక్క పెళ్లి కూడా ప్రాథమిక పాఠశాలను బుధవారం ఉదయం మేధా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్ తో పాఠశాల పిల్లలకు ఏమేమి సౌకర్యాలు అవసరము అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేధా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు స్వాతి మాట్లాడుతూ పాఠశాలకు విద్యార్థుల కోసం ఏమైనా అవసరాలు ఉన్నా తమకు తెలియజేయాలని, పాఠశాల, పిల్లల యొక్క సౌకర్యాలను కలిగించడానికి మేధా చారిటబుల్ ట్రస్టు ఎప్పుడు ముందుగా ఉంటుందని తెలియజేశారు, పాఠశాల విద్యార్థుల సౌకర్యాలు ఎం అవసరమో తెలుసుకొని, ఆ సౌకర్యాలను తీర్చడానికే తమ మేధా చారిటబుల్ ట్రస్టు సభ్యులము ఈరోజు పాఠశాలను సందర్శించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీద చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శేఖర్,అజయ్, పాఠశాల ఉపాధ్యాయులు అంకం అరుణ, రమేష్, మౌనిక ప్రభాకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

జనగణన–2027 రెండో దశకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

: భారతీ హోళికేరి



జనగామ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణలో జనగణన 2027 రెండో దశను పకడ్బం దీగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జనగణన సంచాలకులు భారతీ హోళి కేరి అధికారులను ఆదేశించారు. బుధ వారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తోకలిసి జిల్లా స్థాయి అ ధికారులు, ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఇల్లు, కుటుంబం, వ్యక్తి వివరాలను ఖ చ్చితంగా నమోదు చేయాలని, ఎవరూ తప్పిపోకుండా, వివరాలు రెండుసార్లు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు.జనాభా,భవనాల వివరాల ఆధారంగా ఎన్యూమరేషన్ బ్లాక్‌లను విభజించి, గ్రామాలు, వార్డుల సరిహద్దులు దాటకుండా మ్యాప్‌లను సిద్ధం చేయాలన్నారు. ఎన్యూమరేటర్ల కు అవసరమైన శిక్షణ అందించి, జన గణన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రజలకు జనగణన పై అవగాహన క ల్పించేందుకు విస్తృ త ప్రచారం చేపట్టా లని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ చినకోట్యా నాయక్, జిల్లా స్థాయి అధికారులు, ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, బాధితులకు అందుతున్న వైద్య సహాయం, పీఎం రహత్' పథకం పై బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రధాన ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలను మరింత పటిష్టం చేయాలని, ముఖ్యంగా జనరల్ ఫిజిషియన్, న్యూరో, ఆర్థో వైద్య నిపుణులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రిమ్స్ ఆసుపత్రికి రోడ్డు ప్రమాద కేసులు ఎక్కువగా వస్తున్నందున, రిమ్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉట్నూర్, ఇచ్చోడ ప్రాంతాల నుంచి వచ్చే బాధితుల కేసులను వెంటనే రిమ్స్ ఆసుపత్రికి త్వరగా చేరవేసేలా రవాణా శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. అలాగే, రిమ్స్ డైరెక్టర్, డీఎంహెచ్‌వో పరస్పరం సమన్వయం చేసుకొని వైద్య సేవల తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'పీఎం రహత్' పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక భరోసా లభిస్తుందని, పథకం ద్వారా ప్రమాదంలో గాయపడిన ఒక్కో పేషెంట్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 1.50 లక్షల వరకు వెచ్చించడానికి అవకాశం ఉంటుందని, అర్హులైన బాధితులు ఈ సేవలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. సాధన, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ రోహిత్, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ సత్యనారాయణ, టీం లీడర్ వ్యాస్, 108 కోఆర్డినేటర్ శేఖర్, ఈదార్ మేనేజర్ నితిన్, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నీటి సాక్షిగా.. పశువుల మేతగా మారిన వరిచేను!

* **కరువు జాబితా నుంచి కొందుర్గు మినహాయింపుపై రైతుల ఆందోళన**
* **నీరు లేక పైరు నీరసించెను.. కన్నీటితో రైతు కలలన్నీ కరిగిపోయే!**

ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ :అన్నం పెట్టాల్సిన పొలమే నేడు పశువులకు పచ్చికగా మారింది. గుండె నిండా నమ్మకం పెట్టుకుని, చెమట చుక్కను నీరుగా మార్చి పెంచిన పంట.. సాగునీరు అందక చేతికందే సమయానికి ఎండుముఖం పట్టింది. పండితే నాలుగు గింజలు నోట్లోకి వెళ్తాయనుకున్న రైతుకు, ఎండిన పైరును చూసి కన్నీళ్లే దిక్కయ్యాయి. దిగుబడి రాని పంటను చూస్తూ ఉండలేక,కోత ఖర్చులు కూడా రావని తేలిపోవడంతో..కంటికి రెప్పలా కాపాడుకున్న వరిచేనును కంటిముందే పశువుల మేతకు వదిలేశాడు ఆ అన్నదాత. నాటిన నాటు నుంచి నేటి వరకు పడిన కష్టమంతా వృథా కావడంతో రైతు గుండెకోత వర్ణనాతీతంగా మారింది.



క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు..

షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో కొందుర్గు మండలం వ్యవసాయ రంగంపై అత్యధికంగా ఆధారపడిన ప్రాంతంగా మొదటినుంచి గుర్తింపు ఉంది. ఇక్కడ క్షేత్రస్థాయి పరిశీలిస్తే పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయి. కొందుర్గు మండలంలో వరి 4,910 ఎకరాలు, మొక్కజొన్న 4,864 ఎకరాలు, పత్తి 743 ఎకరాలు, కంది 700 ఎకరాలు, జొన్న 30 ఎకరాలు, ఇతర కూరగాయలు 600 ఎకరాలకు పైగా సాగయ్యాయి. కానీ, ప్రస్తుతం ఈ పంటలు చేతికొస్తాయనే నమ్మకం ఏమాత్రం లేదు. మండల పరిధిలోని బేరంపల్లి గ్రామానికి చెందిన రైతు పెంటయ్య ఒక ఎకరన్నార పొలంలో వేసిన వరి పూర్తిగా దెబ్బతినడంతో, దిక్కుతోచని స్థితిలో దానిని పశువులకు మేతగా వదిలేశాడు. ఇలా మండలంలో అనేక మంది రైతులు తాము సాగు చేసిన పంటలపై నమ్మకం కోల్పోయి నిరాశలో కూరుకుపోయారు.

* **ఎల్నీనో ప్రభావం.. కరువు జాబితాలో నిరాశ**

రాష్ట్రవ్యాప్తంగా ఎల్నీనో ప్రభావం షాద్‌నగర్ నియోజకవర్గంపై తీవ్రంగా పడింది. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో ఫరూక్‌నగర్, కొత్తూరు, చౌదరిగుడ తదితర మండలాలు చోటు దక్కించుకున్నాయి. అయితే, వాటితోపాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొందుర్గు, నందిగామ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశమైంది.వ్యవసాయంపైనే పూర్తిగా ఆధారపడిన కొందుర్గు మండలాన్ని తాజా కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడంపై స్థానిక ప్రజలు, రైతులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.అధికారుల నిర్లక్ష్యపు తప్పుడు నివేదికల వల్ల ప్రభుత్వం ఈ మండలాన్ని విస్మరించిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ వైఖరిని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండిస్తుండగా, నష్టపోయిన రైతన్నలకు తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

శ్రీ వాసవి రక్షణ కవచం ద్వారా నిరుపేద కుటుంబానికి సహాయం

* **సైకిల్ ,బీరువా బహుకరణ**

ప్ర జా స్ఫూ ర్తి , సూ ర్యా పేట : పేద ఆర్యవైశ్యులకు బాసటగా, వారికి జీవనోపాధి కల్పించే విధంగా శ్రీ వాసవి రక్షణ కవచం నిలుస్తుందని శ్రీ వాసవి రక్షణ కవచం గౌరవ సలహాదారులు తప్సీ గాంధీ, కలకోట లక్ష్మయ్య, చల్లా సత్యనారాయణ లు తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి సేవాసమితి కార్యాలయంలో సూర్యాపేటకు చెందిన పేద ఆర్యవైశ్యులు బెలిదే చంద్రశేఖర్ పద్మ దంపతులకు పదివేల రూపాయల విలువగల సైకిల్, బీరువా, రెండు వాటర్ క్యాన్లు శ్రీ వాసవి రక్షణ కవచం వ్యవస్థాపకులు బచ్చు పురుషోత్తం తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేటలో శ్రీ వాసవి రక్షణ కవచం



స్థాపించి ఆర్యవైశ్యుల నుండి ప్రతినెలా వంద రూపాయలు సేకరించి ఒక పేద ఆర్యవైశ్యునకు పదివేల రూపాయలు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.గత నెల సూర్యాపేటకు చెందిన నీళ్ల రాజ్యలక్ష్మి ఆపరేషన్ నిమిత్తం పదివేల రూపాయలు ఇవ్వడం జరిగిందని, రెండవ నెల గా మంచినీరు సప్లై చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న చంద్రశేఖర్ కు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి రక్షణ కవచం సభ్యులు దేవరశెట్టి సత్యనారాయణ, వీరవెల్లి భాస్కర్, దేవరశెట్టి నాగరాజు, బచ్చు శ్రీనివాస్ ,సోమా ప్రవీణ్ కుమార్, ఉప్పలంచు కృష్ణ,బ్రాహ్మణపల్లి సంతోష్ కుమార్, జర్నలిస్ట్ కృష్ణ, చిత్తలూరు శ్రీధర్, సోమ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బిజెపి సోషల్ మీడియా పగ్గాలు చేపట్టిన కిరణ్ కుమార్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:భారతీయ జనతా పార్టీ మానుకోట జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గా నాళ్ళ కిరణ్ కుమార్ గుప్తా నియమితులయ్యారు.జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.పార్టీ బలోపేతానికి, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కిరణ్ కుమార్ గుప్తా కృషి చేస్తారని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను,పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి,జిల్లా నాయకత్వానికి కిరణ్ కుమార్ గుప్తా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దిరాజు రామచందర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు గడ్డం అశోక్,చీకటి మహేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దిడ్డి మహేష్ వర్మ,ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మురళి, బీజేవైఎం ట్రెజరర్ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

* **నలుగురిని అదుపులోకి తీసుకున్న నల్లగొండ పోలీసులు.**

ప్రజాస్ఫూర్తి ,నల్లగొండ :తెలుగు రాష్ట్రాల్లో వరుసగా వ్యవసాయ, కర్మాగార విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర దొంగల ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వేములపల్లి పరిధిలోని సూర్యాపేట ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఈ ముఠా గుట్టు రట్టయింది. అరెస్టు చేసిన దొంగల వివరాలను ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇప్పటివరకు మొత్తం 29 చోరీలకు తెలంగాణలో 25, ఏపీలో 4 ఈ ముఠా పాల్పడిందని చెప్పారు. జల్సాలకు అలవాటుపడిన నిందితులు రాత్రివేళల్లో తమ వెంట మహిళలను కూడా కారులో తిప్పుకుంటూ, పోలీసులకు అనుమానం రాకుండా పానాలు,



కట్టర్లతో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్, ఆయిల్, వైర్లను దొంగిలించే వారని ఆయన చెప్పారు.

* **స్వాధీనం చేసుకున్న సొత్తు.**

అరెస్టు చేసిన దొంగల నుండి రూ. 20 లక్షల నగదు,రూ. 30 లక్షల విలువైన 2 కార్లుకాపర్ వైర్, దొంగతనానికి వాడిన కట్టర్లు, పానాలు, గ్లౌసెస్, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ చెప్పారు. అరెస్టయిన వారిలో షేక్ చాంద్ పాషా, రామావత్ సూర్య, గలబ సాయి కిరణ్, దొంగిలించిన సొత్తు కొనుగోలు చేసే వ్యాపారి ఇస్లావత్ దేశిరామ్ లు ఉన్నారని. ఈ కేసులో మరో ఐదుగురు సభ్యులు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.100 శాతం రికవరీతో రైతుల్లో భరోసా నింపిన వేములపల్లి, మిర్యాలగూడ, సిసిఎస్ పోలీసు బృందాలను నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లో విషాదం.. 8వ తరగతి విద్యార్థి ఆత్మహత్య



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని స్టే షన్ ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుం ది. గ్రామానికి చెందిన గుండె సంపత్, స్వప్న దంపతుల కుమారుడు రుత్విక్ (13) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలుడు స్థానిక మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం 8.45 గంట లకు ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లిన రుత్విక్..సాయంత్రం తల్లి ఇంటికి వచ్చే సరికి ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతూ కని పించాడు. తలుపులు లోపలి నుంచి గ డియపెట్టి ఉండటంతో కిటికీలోంచి చూ డగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు కే సు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడు ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

* **కూసుమంచి ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందికి అవగాహన సదస్సు**

కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఎన్నికల రూరల్ అబ్జర్వర్ దేవసేన సూచించారు. కుసుమంచి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎస్ఐఆర్, ఓటరు నమోదు ప్రక్రియపై ఆమె కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ పురోగతి, ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం 6, ఓటరు జాబితా నుంచి పేర్ల తొలగింపు కోసం ఫారం 7, ఓటరు వివరాల్లో మార్పులు, చిరునామా మార్పులు తదితర అంశాలకు సంబంధించిన ఫారం 8 దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, కుసుమంచి తహసీల్దార్, ఎంపీడీవో, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులు తదితరులు



పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు తమ తమ నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఫారం 6, 7, 8 దరఖాస్తుల స్థితిగతులు, ఓటరు జాబితా సంబంధిత పనులపై వివరాలను సమర్పించారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఖమ్మం నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, సబ్‌కలెక్టర్, మధిర నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి, పాలేరు నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఖమ్మం ఐపిటి రైల్వేస్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడం, ఓటరు జాబితా శుద్ధీకరణలో పారదర్శకత పాటించడం, ఫారం 6, 7, 8 దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించడం, అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో సంబంధిత అధికారులు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేస్తూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సమావేశంలో సూచించారు.

ప్రభుత్వ సేవల్లో ఏఐ

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్' కార్యక్రమం ప్రారంభం

ప్రజాస్ఫూర్తి : తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఏఐ సాక్షమ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో ప్రారంభించారు.ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం యొక్క ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు, పింఛనుదారులు వంటి వారు పదేపదే ఆఫీసుల చుట్టూ తిరిగే దుస్థితికి చరమగీతం పాడాలన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయా లేదా అనే విశ్లేషణ, విద్యుత్ డిమాండ్ అంచనా వంటి పనులకు ఏఐ ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. అదే సమయంలో ఏఐ వినియోగంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి అని భట్టి నొక్కిచెప్పారు. ఏఐ అందించిన సమాచారాన్ని అధికారులు కచ్చితంగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తామని, ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. చిన్నస్థాయి ప్రయోగాలు విజయవంతమైన తర్వాతే ఏఐ వ్యవస్థలను విస్తరించాలని, ఏవైనా లోపాలు జరిగితే బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని అన్నారు. ప్రజలకు అందే వేగవంతమైన, పారదర్శక సేవలే ఏఐ విజయానికి గీటురాయి అవుతాయని ఆయన పేర్కొన్నారు.

MOVIE TIME



సంయుక్త సినిమాలకు రిలీజ్ చిక్కులు!





నటి సంయుక్త చేతిలో సినిమాలున్నా.. విడుదల విషయంలో మాత్రం జాప్యం తప్పడం లేదు. ఆమె నటించిన 'స్వయంభు', 'స్లమ్ డాగ్', 'బ్లాక్ గోల్డ్' చిత్రాలు షూటింగ్ పూర్తి చేసుకున్నా ఇంకా ప్రేక్షకుల ముందుకు రాలేదు. 'స్వయంభు' ఫిబ్రవరి 13న విడుదల కావాల్సి ఉండగా వాయిదా పడింది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'స్లమ్ డాగ్'కు కూడా రిలీజ్ డేట్ ఖరారు కాలేదు. ఇక 'బ్లాక్ గోల్డ్' సైతం విడుదల కోసం ఎదురుచూస్తోంది. ఈ నేపథ్యంలో సంయుక్తకు 'హైందవ' కాస్త ఊరటనివ్వనుంది. ఈ సినిమా నవంబర్‌లో విడుదల కానుంది. మరోవైపు వరుసగా సినిమాలు విడుదల కాకపోవడంతో ఆమె కొత్త ప్రాజెక్టులపై కూడా ఆసక్తి నెలకొంది. మరి 'హైందవ'తోనైనా సంయుక్తకు హిట్ దక్కుతుందా? పెండింగ్‌లో ఉన్న మిగతా చిత్రాలు ఎప్పుడు థియేటర్లలోకి వస్తాయో చూడాలి.

మృణాల్ పెళ్లిపై రూమర్స్

బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ పెళ్లిపై మరోసారి వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. డిసెంబర్‌లో ఆమె వివాహం జరగనుం దంటూ రెడిట్‌లో ఓ పోస్టు వైరల్‌గా మారింది. వరుడు ఎవరనే విషయాన్ని మాత్రం పేర్కొన లేదు. ఈ ఏడాది ఆరంభంలోనూ తమిళ హీరో ధనుష్‌తో మృణాల్ పెళ్లంటూ ప్రచారం జరగ్గా.. అందులో నిజం లేదని తేలింది. తాజాగా వస్తున్న వార్తలపై మృణాల్ ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు ఈ ఏడాది ఆమె నటించిన మూడు సినిమాలు విడుదలైనా.. బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. ప్రస్తుతం అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'రాకా'లో ఆమె నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అఫీషియల్ ప్రకటన రావాల్సి ఉంది.

30న శ్రద్ధా ఈతా ట్రైలర్

శ్రద్ధా కపూర్ లీడ్‌రోల్‌లో నటిస్తున్న 'ఈతా' మూవీ ట్రైలర్ శుక్రవారం విడుదల కానుంది. రణదీప్ హుడా కీలక పాత్రలో కనిపించనున్న ఈ చిత్ర టీజర్ ఇటీవల విడుదలై ఆకట్టుకుంది. మహారాష్ట్ర సంప్రదాయ కళారూపమైన తమాషా నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో శ్రద్ధా.. విఠాబాయి పాత్రలో కనిపించనుంది. తొమ్మిది నెలల గర్భిణిగా ప్రసవ వేదనను అనుభవిస్తున్నప్పటికీ, నాట్య ప్రదర్శన కోసం వేదికపైకి వచ్చే కళాకారిణిగా ఆమె నటన ఆసక్తి రేకెత్తిస్తోంది. 'నాట్యం చేస్తూ చనిపోతే ఓ ఉదాహరణగా నిలిచిపోతా' అనే భావంతో సాగే సంభాషణలు టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ మూవీ డిసెంబర్ 4న థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నారు.



హిట్ కోసం వెయిటింగ్!

నిధి అగర్వాల్ కెరీర్ ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. తెలుగులో 'సవ్యసాచి'తో (2018) అడుగుపెట్టిన ఈ భామకు 'ఇస్మార్ట్ శంకర్' మంచి విజయాన్ని అందించింది. ఆ తర్వాత 'హరి హర వీరమల్లు', 'ది రాజా సాబ్' వంటి భారీ చిత్రాల్లో నటించినా.. ఆశించిన స్థాయిలో విజయాలు దక్కలేదు. అయినా అవకాశాలు మాత్రం వరుస కడుతున్నాయి. ప్రస్తుతం హిందీలో మూడు, తమిళంలో ఒకటి, తెలుగులో రెండు సినిమాలు చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ఓ యువ హీరో సరసన నటించే చిత్రంతో పాటు వుమెన్ ఓరియంటెడ్ మైథలాజికల్ మూవీ ఉన్నది. ఈ ప్రాజెక్టులన్నీ కార్యరూపం దాలిస్తే రాబోయే రెండేళ్లు నిధి కెరీర్‌కు కీలకం కానున్నాయి.



నివేదాపై ట్రోలింగ్

'ఆదర్శ కుటుంబం' సినిమా స్టోరీ తనకు పూర్తిగా తెలియదంటూ నటి నివేతా పేతురాజ్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రీ రిలీజ్ వేడుకలో ఆమె చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు ట్రోలింగ్‌కు దిగారు. సినిమా కథే తెలియ కుండా ఎలా నటించారంటూ విమర్శలు గుప్పించారు. అయితే, నివేదా ఉద్దేశం వేరని తెలుస్తోంది. తన పాత్రకు సంబంధించిన కథ మాత్రమే తెలుసని, పూర్తి స్క్రిప్ట్ గురించి ఆమె ప్రస్తావించలేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. నటీనటు లకు పూర్తి స్క్రిప్ట్ ఇవ్వకుండా, వారి పాత్రలకు సంబంధించిన సన్నివేశాలను మాత్రమే వివరించడం సాధారణమే. వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, సత్య, రావు రమేశ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.